సాక్షి కామారెడ్డి

బుధవారం । 1 । జనవరి । 2025



ప్రభుత్వానిది ఒంటెద్దు పోకడ

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఒంటికా లిపై నిల్చొని నిరసన తెలిపారు.

- 9లో ▸



చర్యలు తీసుకోవాలి

బల్దియాకు సంబంధించిన పాత సామగ్రిని అమ్ముకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.4 /14.4

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.



కామారెడ్డిలోని బేకరీలో సందడి

జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

బైబై 2024.. వెల్‌కమ్ 2025

కాలగర్భంలో మరో సంవత్సరం కలిసిపోయింది. ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిన 2024 కు జిల్లావాసులు వీడ్కోలు చెబుతూనే కొత్త ఆశలను మోసుకుంటూ వచ్చిన 2025కు ఘన స్వాగతం పలికారు. ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. బేకరీలు, చికెన్, మటన్ సెంటర్లు, వైన్ షాపుల వద్ద క్యూలు కనిపించాయి. అర్ధరాత్రి వేళ పలువురు కేక్‌లు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. – కామారెడ్డి టౌన్

న్యూస్‌రీల్

కామారెడ్డి ఏఎంసీ పాలకవర్గం ఖరారు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం మంగళవారం ఖరారు చేసింది. చైర్‌పర్సన్‌గా ధర్మగోని లక్ష్మి రాజాగౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా మిన్కూరి బ్రహ్మానందరెడ్డి, సభ్యులుగా అవుసుల బ్రహ్మం, లోకోటి సుదర్శన్‌రావు, కల్లూరి భూమయ్య, గోగు జ్యోతి, ఎర్ర నారాగౌడ్, నాగారపు రాజలింగం, మహమ్మద్ మక్బూల్, నునావత్ గణేశ్, కొత్త అరవింద్, జిల్లెల్ల భూపతి, వలిపిశెట్టి లక్ష్మీరాజం, దోమకొండ శ్రీనివాస్‌తో పాటు మాచారెడ్డి పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లను సభ్యులుగా నియమించింది.

డీటీసీపీవోగా సువర్ణదేవి



కామారెడ్డి టౌన్: డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ (డీటీసీపీవో)గా సువర్ణదేవి నియమితులయ్యారు. మంగళవారం ఆమె విధుల్లో చేరారు. గతంలో డీటీసీపీవోగా విధులు నిర్వర్తించిన నరహరి నాయక్ మంగళవారం పదవీవిరమణ పొందగా, హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న సువర్ణదేవి ఆయన స్థానంలో బదిలీపై వచ్చారు. పదవీవిరమణ పొందిన నరహరి నాయక్‌కు కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై నరహరినాయక్ దంపతులను సన్మానించారు. సర్వీస్‌లో చివరి రోజున ఆయనకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఒక్క రోజు మాత్రమే విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు.

ఇందిరమ్మ సర్వేలో కామారెడ్డి బల్దియా లాస్ట్

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కామారెడ్డి బల్దియా చివరి స్థానంలో ఉంది. ఇప్పటివరకు 65 శాతం మాత్రమే సర్వే చేశారు. అత్యధికంగా రాజంపేట మండలంలో 93 శాతం సర్వే పూర్తయింది. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 84 శాతం, బాన్సువాడ బల్దియాలో 82 శాతం సర్వే పూర్తి చేశారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



కళాధర్ రాజు

కామారెడ్డి క్రైం: పోలీసు శాఖలో పనిచేస్తూ ఈ ఏడాదికిగాను ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు రాష్ట్ర పోలీసు శాఖ మంగళవారం ఉత్తమ సేవా పథకాలను ప్రకటించింది. ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు అధికారులున్నారు. వీఆర్ ఎస్సైలు ఉదయ్ శేఖర్, శ్రీరాం, ఏఆర్ ఎస్సైలు వినయ్ కుమార్, ఆంజనేయులు, కామారెడ్డి టౌన్ ఏఎస్సై కళాధర్ రాజు, బీర్కూర్ మహిళా ఏఎస్సై సీతారామమ్మ, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు అమీరుద్దీన్, దేవసహాయం, శ్రీరాం, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, కానిస్టేబుళ్లు సాయిలు, వెంకట్‌రావు, మధుకర్, అబ్దుల్ వహాబ్ ఉన్నారు. సేవా పథకాలు దక్కించుకున్న అధికారులను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. రెండు మెడికల్ ఆఫీసర్, ఒక ఫార్మసిస్టు పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు నిజామాబాద్‌కు ఎస్సీ కమిషన్ రాక

కామారెడ్డి అర్బన్ : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ గురువారం జిల్లాకు రానుంది. ఉదయం 11గంటలకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి సలహాలు, సూచనలు, వినతులు స్వీకరించనున్నట్టు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన ఉద్యోగులు, సంఘాల నాయకులతో పాటు ఇతరులు వినతులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

మరింత పురోగతి సాధిస్తాం



- ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలపై దృష్టి
- ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం
- వచ్చే విద్యాసంవత్సరంలో నీట్, జేఈఈ కోచింగ్
- టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''నూతన సంవత్సరంలో అన్నింటా మరింత మెరుగైన ఫలితాల కోసం ప్రణాళికబద్ధంగా సాగుతాం. ప్రధానంగా విద్యారంగంపై దృష్టి సారించాం. ఇంటర్‌లో మెరుగుపడాలన్న లక్ష్యంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరంనుంచి నీట్, జేఈఈ కోచింగ్ ఇప్పిస్తాం. జిల్లాను పర్యాటకంగానూ అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం'' అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న తరుణంలో ప్రాధాన్యత అంశాలపై 'సాక్షి' కలెక్టర్‌తో ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు..

పర్యాటకంపై దృష్టి..

''జిల్లాలోని పలు ప్రాంతాలలో టూరిజం డెవలప్‌మెంట్‌కోసం ప్లాన్ చేశాం. కొత్త సంవత్సరంలో వాటిని చేపట్టి పూర్తి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దుతాం. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద మంచి స్పాట్ రూపొందించి టూరిస్టులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. లింగంపేట మెట్ల బావిని తీర్చిదిద్ది నిర్వహణను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. మరికొన్నిచోట్ల పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం'' అని కలెక్టర్ తెలిపారు.

ధరణి సమస్యలెన్నో పరిష్కరించాం

''నేను కామారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేనాటికి ధరణికి సంబంధించి 6 వేల ఫైలులకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కొత్తగా రోజూ నలభై యాభై దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. పాతవి, కొత్తవి కలిపి దాదాపు 7వేల దరఖాస్తులు పరిష్కరించాం. ఇంకా 1,912 పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం'' అని కలెక్టర్ తెలిపారు.

'మహిళా శక్తి'తో..

''మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మహిళా శక్తి పథకం దోహదపడుతోంది. ఈ పథకంలో భాగంగా ఇప్పటికే కామారెడ్డితో పాటు బాన్సువాడ, సదాశివనగర్, దోమకొండలలో క్యాంటీన్లను ప్రారంభించాం. అవి బాగా నడుస్తున్నాయి. మహిళలను చేపల పెంపకం వంటి ఉపాధి మార్గాలవైపు ప్రోత్సహిస్తున్నాం. అన్ని పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు'' అని ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు.

వేగంగా దరఖాస్తుల పరిశీలన

''జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,38,682 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించేందుకు సర్వే చేస్తున్నాం. ఇప్పటివరకు 75 శాతం సర్వే పూర్తయ్యింది. వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మిగిలిన దరఖాస్తుల సర్వేనూ త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తాం'' అని కలెక్టర్ సంగ్వాన్ వివరించారు.

విద్యా రంగంపై..

''గతేడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో దిగువన ఉన్నాం. ఈసారి మెరుగుపడాలన్న లక్ష్యంతో సాగుతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. తాను కూడా పలు కళాశాలలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడా. విద్యార్థుల హాజరు పెరగడం, ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది. కొత్త సంవత్సరంలో మరింతగా ఫోకస్ చేసి మంచి ఫలితాలు వచ్చేలా ప్రయత్నిస్తాం. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రతి కాలేజీ నుంచి కొందరు విద్యార్థులను ఎంపిక చేసి వారికి జేఈఈ, నీట్‌లలో కోచింగ్ ఇప్పించేందుకు ప్రణాళిక రూపొందించాం. వచ్చే విద్యాసంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు నీట్, జేఈఈ కోచింగ్ ఇప్పించాలన్న లక్ష్యంతో సాగుతున్నాం'' అని కలెక్టర్ పేర్కొన్నారు.

కొత్త ఏడాదిలో.. సరికొత్తగా



- ప్రతి పోలీస్ స్టేషన్‌కూ ప్రత్యేక ప్రణాళిక..
- పాజిటివ్ దృక్పథంతో సాగుతాం
- 'సాక్షి'తో ఎస్పీ సింధుశర్మ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''నేరాలను నియంత్రించడానికి స్పష్టమైన సరికొత్త ప్రణాళికతో ముందుకు వెళ్తాం. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్‌కూ ఒక ప్లాన్ ఉండాలని, దాన్ని అనుసరించాలని అధికారులకు స్పష్టంగా చెప్పాను. కొత్త సంవత్సరంలో ఆ దిశగా ముందుకు సాగుతాం'' అని ఎస్పీ సింధుశర్మ పేర్కొన్నారు. ''పాజిటివ్ దృక్పథాన్ని పెంపొందించుకుని అన్ని విషయాల్లోనూ విజయవంతం కావాలి. అందరినీ అలా తయారు చేసే ప్రయత్నం చేస్తున్నాం'' అని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలపై ఎస్పీ సింధు శర్మ మంగళవారం 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

మత్తు వ్యాపారాలను ఉపేక్షించం

''జిల్లాలో 2023లో మత్తు పదార్థాలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసి, 17 మందిని అరెస్టు చేశాం. 2024లో 31 కేసుల్లో 91 మంది అరెస్టు అయ్యారు. రాబోయే రోజుల్లో మరింత కఠినంగా వ్యవహరిస్తాం. గంజాయి వాడుతున్నారంటే అమ్ముతారని కూడా అనుకోవాల్సిందే. గంజాయి అమ్మినా, గంజాయి మొక్కలు పెంచినా ఊరుకునేది లేదు'' అని సింధు శర్మ పేర్కొన్నారు.

కొత్తవారికి శిక్షణ ఇస్తాం

''పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో చేరిన వారు శిక్షణ తీసుకున్నారు. అయితే వారికి వివిధ అంశాలపై స్థానికంగానూ శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాం. త్వరలోనే 2 వందల మందికి వివిధ రంగాలకు చెందిన నిపుణులతో వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తాం. వారు ఎలాంటి ఒత్తిడినైనా ఎదుర్కొనేలా తయారు కావాలన్నదే నా లక్ష్యం. జిల్లాలో సివిల్, ఏఆర్ విభాగాల్లో కలిపి కొత్తగా 2 వందల మంది సిబ్బంది వచ్చారు. వారిలో నైపుణ్యాలను గుర్తించి విధులు కేటాయించి ప్రోత్సహిస్తాం. తద్వారా వారు ఆయా విభాగాల్లో రాణించగలుగుతారు'' అని ఎస్పీ వివరించారు.

నైట్ పెట్రోలింగ్‌తో దొంగతనాలకు చెక్..

''జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు అదనంగా సిబ్బంది రావడంతో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. దీంతో పట్టణంలో దొంగతనాలు తగ్గాయి. పట్టణంలో నేరాలు తగ్గి గ్రామీణ ప్రాంతంలో పెరిగాయి. దానిపై అక్కడి అధికారులు దృష్టి సారించి, చోరీల నియంత్రణకు కృషి చేయాలని సూచించాం'' అని సింధు శర్మ పేర్కొన్నారు.

పరిశోధనా ముఖ్యమే..

''నేరం జరిగినపుడు కేసు నమోదుచేయడంతోపాటు దాని పరిశోధనా సరిగా ఉండాలి. ఆ దిశగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి కేసులోనూ ఎలా వ్యవహరించాలన్న దానిపై దిశానిర్దేశం చేస్తున్నాం. అలా చేయడం వల్లే పలు కేసుల్లో నేరస్తులకు జీవిత శిక్షలు పడ్డాయి. మరికొందరికి ఇతర శిక్షలు ఖరారయ్యాయి'' అని ఎస్పీ తెలిపారు.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన నేరాలు

''జిల్లాలో 67 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఇందులో బాన్సువాడలోనే ఎక్కువగా జరిగాయి. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నారు. కామారెడ్డి పట్టణంలో బైకుల దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో ఒకే రకమైన నేరాలు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయన్న దాన్ని పరిశీలించి వాటిని నియంత్రించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించాం'' అని ఎస్పీ తెలిపారు.

నేరాల నియంత్రణకు..

''ప్రజలు పోలీసుల పనితీరును గమనిస్తుంటారు. అందుకే ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, తప్పు జరగకుండా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించాం. నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో ఒక ప్రణాళిక రూపొందించుకున్నట్లుగానే ప్రతి పోలీస్ స్టేషన్‌కూ ఒక ప్లాన్ అవసరం. గతేడాది ఎలాంటి నేరాలు జరిగాయి? వాటిని ఎలా నియంత్రించాలి అన్నదాని గురించి ఒక ప్లాన్ వేసుకుని దానికి అనుగుణంగా నడుచుకోవాలి. ఇదే విషయాన్ని వార్షిక మీటింగ్‌లో చెప్పాను. కొత్త ఏడాదిలో ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తాం'' అని ఎస్పీ పేర్కొన్నారు.

బల్దియాలో ఇంటి దొంగలపై సీరియస్

- విచారణ చేపట్టిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ఎఫ్‌బీవో శ్యామ్‌పై వేటుకు సిద్ధం
- చోరీపై పీఎస్‌లో కమిషనర్ ఫిర్యాదు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన పాతసామగ్రిని మాయం చేసిన వైనంపై గతనెల 22న 'సాక్షి'లో 'బల్దియాలో ఇంటి దొంగలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇప్పటికే మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ వేణుగోపాల్ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. డీఈపై కొందరు ఒత్తిడి చేయడంతో విచారణ నివేదికను కమిషనర్‌కు సమగ్రంగా సమర్పించలేదని, అలాగే సాక్షులను సైతం బెదిరించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ ఘటనలపై కూడా 'సాక్షి'లో 25వ తేదీన కథనం ప్రచురితమైంది. ఈ వ్యవహారంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పాతసామగ్రి మాయం చేసిన పాత జాతీయ రహదారి పక్కన ఫిల్టర్ బెడ్ వద్ద విచారణ చేపట్టారు. మాయమైన మున్సిపల్ సామగ్రి స్థానంలో పడేసిన తుక్కు పాత సామగ్రిని పరిశీలించారు. ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫిల్టర్ బెడ్ ఆపరేటర్(ఎఫ్‌బీవో) శ్యామ్‌ను విచారించారు. గతనెల 10వ తేదీన లారీలో ఫిల్టర్ బెడ్ వద్ద నుంచి పాత సామగ్రిని తరలించే సమయంలో తాను ఉన్నట్లు ఎఫ్‌బీవో అదనపు కలెక్టర్ ముందు ఒప్పుకోవడంతోపాటు సామగ్రి ఎక్కడికి తరలించారో తెలియదని సమాధానం ఇవ్వడంతో అదనపు కలెక్టర్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్కడే ఉన్న డీఈ, ఏఈ, విధుల్లో ఉన్న కార్మికులను సైతం విచారించారు. ఈ వ్యవహారంలో ఎఫ్‌బీవో శ్యామ్‌పై వేటువేసేందుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. పాత సామగ్రి మాయం ఘటనపై మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ స్పందన 'సాక్షి'తో తెలిపారు.

కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల




ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నిజాంసాగర్ నీరు

నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. డిసెంబర్ 13 న నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటినుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1,402.95 అడుగుల(14.917 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. అయితే వారబందీ ప్రకారం పదిహేను రోజుల పాటు నీటిని విడుదల చేసి 10 రోజుల పాటు బంద్ చేయాల్సి ఉండగా ఆయకట్టు కింద వరి నాట్లు జోరందుకోవడంతో నీటి విడుదలను పొడిగించారు.

పోచారం నీటి విడుదల వాయిదా

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నీటి విడుదలను వాయిదా వేసినట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని 'ఏ'జోన్ ఆయకట్టుకు బుధవారం పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామని డీఈఈ తెలిపారు. ఈనెల 3 లేదా 4 తేదీలలో ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు.







గర్గుల్‌లో హాకీ ప్రీమియర్ లీగ్ పోటీలు



కామారెడ్డి అర్బన్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గర్గుల్ హాకీ ప్రీమియర్ లీగ్ పోటీలను ఎంఈఓ ఎల్లయ్య ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంఈవో అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.









పెన్షనర్ల సమస్యలపై స్పందించాలి

- పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు లచ్చయ్య



బాన్సువాడలో మాట్లాడుతున్న లచ్చయ్య

బాన్సువాడ: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ విధానం మారాలని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ విధివిధానాలు మారుస్తున్నాయని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు లచ్చయ్య తప్పుపట్టారు. మంగళవారం బాన్సువాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రిటైర్ అయిన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం డీఏ, బీఆర్‌లు సకాలంలో ప్రకటించకపోవడం.. గత మార్చిలో ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జీపీఎఫ్ చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అసోసియేషన్ సభ్యులు హన్మంత్‌రెడ్డి, విజయరామరాజు, రవీందర్, పీకే రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

జిల్లా కన్వీనర్‌గా ఖాదర్, కో–కన్వీనర్‌లుగా దేవసుకుమార్, చంద్రప్ప, జిల్లా ప్రతినిధిగా సీమ గంగారాంలను ఎన్నుకున్నారు.

పాత సామగ్రి అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్ స్పందనతో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, నాయకులు

కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీకి సంబంధించి నాలుగు ప్రాంతాలలో నిల్వ ఉంచిన పాత సామగ్రిని గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు, నాయకులు కమిషనర్ స్పందనను డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన అనంతరం చాంబర్‌లో కమిషనర్‌తో మాట్లాడారు. ఈ ఘటనపై 11 రోజుల క్రితం కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, అపర్ణ, తదితరులు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు కమిషనర్‌ను నిలదీశారు. రూ.15 లక్షల విలువ చేసే పాత సామగ్రిని అమ్ముకుని ఫిల్టర్ బెడ్ వద్ద వాటి స్థానంలో రూ.20 వేల విలువ చేయని తుక్కు సామగ్రి వేశారని, అక్కడే దొంగలు దొరికిపోయారని తెలిపారు. అన్ని సాక్ష్యాలతో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను వచ్చి 5 రోజులే అవుతుందని పాత సామగ్రి దొంగతనంపై కలెక్టర్‌కు విన్నవించానని కమిషనర్ వివరణ ఇచ్చారు. కౌన్సిలర్ కృష్ణమోహన్, మాజీ కౌన్సిలర్ ముప్పారపు ఆనంద్, నాయకులు నవీన్, సురేష్ తదితరులున్నారు.

కబ్జా ప్లాట్లు స్వాధీనం



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గ్రామ పంచాయతీకి చెందిన నాలుగు ప్లాట్లు కబ్జాకు గురికావడంతో సోమవారం గ్రామస్తులు ఆందోళన చేసిన విషయం విదితమే. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, లింగంపేటకు చేరుకొని కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. పై అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ నరేందర్ గ్రామ పంచాయితీ ప్లాట్లను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు ప్లాట్ల స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి ఐరన్ రేకులు అమర్చారు. గ్రామ పంచాయతీ, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పెద్దలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ సర్వే పరిశీలన



గాంధారిలో సర్వేను పరిశీలిస్తున్న తెలంగాణ హౌజింగ్ బోర్డు సీఈ చైతన్య, పీడీ విజయపాల్ రెడ్డి



లింగంపేటలో ఇందిరమ్మ ఇళ్ల పునసర్వే చేస్తున్న ఎంపీడీవో నరేష్



పెద్దకొడప్‌గల్‌లో ..ప్రత్యేక అధికారి కిషన్



జనగామలో .. ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతోంది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పున: సర్వే చేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సర్వే చేసిన వాటిని రెండోసారి పరిశీలిస్తూ ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. నిజమైన అర్హులను గుర్తించాలని సర్వే చేస్తున్న సిబ్బందికి సూచించారు. – సాక్షి నెట్‌వర్క్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి కిందపడి కొన ఊపిరితో ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనస్థలానికి పోలీసులు చేరుకొని అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా అతడిని గుర్తుపడితే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

దాడికి వస్తున్నారని.. తాళం వేసి పరార్..!



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పాత రాజంపేట గ్రామంలో బెల్టుషాపు దుకాణంపై గ్రామస్తులు మంగళవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బెల్టు షాపుపై దాడులు చేయడానికి వచ్చేసరికి సదరు షాపు నిర్వాహకుడు తాళం వేసుకుని పరారయ్యాడు. టాస్క్‌ఫోర్స్ అధికారులు వస్తున్నారని ముందుగానే సమాచారం లీక్ కావడంతో తాళం వేసి పారిపోయాడని ప్రచారం సాగుతోంది. బెల్టు షాపులో నిత్యం రూ.లక్ష వరకు విక్రయాలు జరుగుతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తాళం వేసి ఉన్న షాపు వద్ద అధికారులు 3 గంటల పాటు వేచి చూశారు. అయినా నిర్వాహకుడు రాకపోవడంతో వెళ్లిపోయారు.

ఓటీపీ ఆధారంగా పౌష్టికాహారం పంపిణీ



పిట్లం(జుక్కల్): గౌరారం అంగన్వాడి సెంటర్‌లో మంగళవారం పిల్లల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మంగమ్మ మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి ఓటీపీ ఆధారంగా తల్లులకు గుడ్లు, పాలు, బాలామృతం తదితర పౌష్టికాహాం పంపిణీ చేస్తామని తెలిపారు. పౌష్టికాహారం తీసుకెళ్లేవారు ఫోన్ తీసుకొని అంగన్వాడి సెంటర్‌కు రావాలన్నారు. పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మల్లన్న దేవాలయం ప్రహరీ పనులు ప్రారంభం

రాజంపేట: పొందుర్తి గ్రామ యాదవ సంఘం(గొల్ల) మల్లన్న దేవాలయం ప్రహరీ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించినట్లు గ్రామ బీజేపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే రమణారెడ్డి ఇచ్చిన మాట మేరకు ఈ పనులను చేపడుతున్నట్లు గ్రామ నాయకులు తెలిపారు.

కొత్త సంవత్సర సంబురాలు



నిజాంసాగర్‌లో వేడుకల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర సంబురాలు ఘనంగా జరిపారు. అంగన్‌వాడి టీచర్లు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు ఉన్నారు.

బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఆయా గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల రామాలయంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి బూత్‌కు ఓ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, హన్మండ్లు యాదవ్, తదితరులు ఉన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని బండరామేశ్వరపల్లి గ్రామానికి చెందిన చెన్నబోయిన అనూష(21), కూతురు నిదీక్ష(1)తో కలిసి అదృశ్యమైనట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లిన అనూష తిరిగి రాలేదు. ఎంతవెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

